సాక్షి సూర్యాపేట

మంగళవారం : 30 : జనవరి : 2024



కబడ్డీ జట్ల కెప్టెన్లుగా..
రాష్ట్ర జూనియర్ బాలబాలికల జట్లకు నల్లగొండ జిల్లా వాసులు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.
- 8లో



నిర్లక్ష్యానికి ఆరుగురు బలి
మిర్యాలగూడ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు.
- 8లో



ఫేషియల్ క్రీమ్‌లు సీజ్
మిర్యాలగూలో ఓ కంపనీకి చెందిన ఫేషియల్ క్రీమ్‌లను డ్రగ్ కంట్రోల్ అధికారులు సీజ్ చేశారు.
- 8లో

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణానికి రూ.74.80 కోట్లు మంజూరు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారామస్వామి గట్టు వద్ద లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి ఫలించింది. 2,160 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ 74.80 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు మంజూరు పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి రాత్రితో గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: జిల్లాకు యాసంగి సీజన్‌కుగాను వస్తున్న గోదావరి జలాలు వారబందీ విధానంలో మంగళవారం రాత్రితో నిలిచిపోనున్నాయి. రెండో విడతలో ఈనెల 23న నీటిని జిల్లాకు విడుదల చేశారు. అయితే వారం పూర్తి కావడంతో నిలిపివేయనున్నారు. తిరిగి వారబందీ విధానంలో ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు తిరిగి గోదావరి జలాలు రానున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ అమర్ తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణ కుమారి

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హెచ్.అరుణ కుమారి కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, ఆట స్థలంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రిన్స్‌పాల్ సీహెచ్. ధనవిజయ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్స్ వసంత, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

మునగాల: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మునగాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మండల కేంద్రంలోని గణపవరం రోడ్డులో 491సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉంటున్న పేదలకు పట్టాలు అందించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సోమపంగు జానయ్య, జిల్లా, మండల కమిటీల నాయకులు దేవరం వెంకట్‌రెడ్డి, ఆరె.రామకృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, గ్రామస్తులు తొగాటి వేలాద్రి, గట్టు శ్రీను, సాలె రవి, గోవింద్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డైరెక్టర్, వైద్యులు

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం మెడికల్ లిటరేచర్ సెర్చింగ్ అండ్ రెఫరెన్సింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ పరిశోధనలు చేయడానికి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీన్ రాహుల్‌నారంగ్స్, రీసెర్చ్ ప్రొఫెసర్ సంగీత, వైద్యులు అపర్ణ, లక్ష్మిజ్యోతి పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లె



మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెంలో బొడ్రాయి, గ్రామదేవతల ఆలయాల వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. గిరిజనులు, మహిళలు కలిసి డప్పువాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల బదిలీలు!

- ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో భారీగా ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లకు కసరత్తు
- మూడేళ్లుగా ఒకేచోట ఉన్న అధికారుల ప్రాథమిక జాబితా సిద్ధం
- సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారి జాబితా కూడా..
- ఫిబ్రవరి మొదటి వారంలో ప్రక్రియ పూర్తి చేసే అవకాశం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. పలువురు అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట ఉండడం, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో మూడేళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు సైతం విడుదల చేసింది. ఫిబ్రవరి మొదటివారంలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో మూడేళ్లుగా ఒకే సీటులో పాతుకుపోయిన అధికారులతో పాటు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, గతంలో జరిగిన ఎన్నికల్లో పలు ఆరోపణలు, ఫిర్యాదులు ఎదుర్కొన్న అధికారులు, జూన్‌లోగా పదవీ విరమణ చేయనున్న అధికారులు ఇలా పలు జాబితాలను సిద్ధం చేయడంపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 40 మందికిపైగా కీలక అధికారులు బదిలీ కానున్నట్లు చర్చ జరుగుతోంది. ఇందుల్లో జిల్లా అధికారులు 16 మంది ఉన్నట్లు సమాచారం.

ప్రాథమిక జాబితా రెడీ

జిల్లాలో మూడేళ్లుగా కీలక పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న అధి కారుల జాబితాను ఉన్నతాధికారులు ప్రాథమికంగా రెడీ చేశారు. దీనిని పరిశీలించి తుది జాబితా రూపొందించనున్నారు. ఇందులో రెవెన్యూ శాఖలో ఆర్‌డీఓలు, పంచాయతీ రాజ్‌శాఖలో డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏలో ఈజీఎస్ ఏపీడీ, వ్యవసాయ శాఖలో డీఏఓ, బీసీ వెల్ఫేర్ శాఖలో డీబీసీడీఓ, ఏబీసీడీఓ, స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో జిల్లా ఆడిట్ అధికారి, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో డీఈఓ, ఉపాధి కల్పన శాఖలో డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఉన్నారు. ఉద్యానవన శాఖలో జిల్లా హార్టికల్చర్ అధికారి, లీగల్ మెట్రాలజీలో జిల్లా మెట్రాలజీ అధికారి, మైన్స్ అండ్ జియాలజీలో జిల్లా అధికారి, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో జిల్లా ప్లానింగ్ అధికారి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో డీపీఆర్ఈ, రోడ్స్ అండ్ బిల్డింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్అండ్‌బీ ఈఈ, డీఈలు, ఎస్సీ కార్పొరేషన్‌లో ఈడీ, ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో డీఎస్‌సీడీఓ, జిల్లా స్పోర్ట్స్ అధికారి, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డు విభాగంలో ఎస్అండ్ఎల్ఆర్ ఏడీ ఉన్నారు.

సొంత జిల్లాలో కీలక అధికారులు వీరే..

సొంత జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కీలక అధికారుల ప్రాథమిక జాబితాను సైతం రూపొందించారు. ఇందులో ప్రధానంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో డీఆర్‌డీఓ, ఈజీఎస్ ఏపీడీ, సహకార శాఖలో జిల్లా సహకార అధికారి, హార్టికల్చర్ అండ్ సెరీకల్చర్ విభాగంలో జిల్లా హార్టికల్చర్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్‌లో ఈడీ, జిల్లా సంక్షేమ విభాగంలో డీడబ్ల్యూఓ ఉన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు..


వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఉద్యోగుల బదిలీలు చేయడానికి ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్‌లో పదవీ విరమణ చేయనున్న వారిని బదిలీ నుంచి మినహాయించనున్నారు. గతంలో ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన అధికారులపై ఎన్నికల సంఘం క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తే అలాంటి వారికి మళ్లీ ఎన్నికల విధులు అప్పగించకుండా చూస్తున్నారు. చర్యలు పెండింగ్‌లో ఉన్న అధికారులను సైతం ఎన్నికల విధులకు దూరంగా ఉంచే యోచన చేస్తున్నారు. ఎలాంటి చర్యలకు సిఫార్సు చేయకుండా కేవలం బదిలీ చేయాలని సూచించిన వారిని మాత్రం బదిలీల పరిధిలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసి ఎన్నికల సంఘానికి నివేదించారు. అంతర్గత బదిలీలు, డిప్యుటేషన్లపై వచ్చిన వారిని వెనక్కి పంపడానికి సైతం అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ?

మోత్కూరు : మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేసినట్లు తెలిసింది. చైర్‌పర్సన్ సావిత్రి (బీఆర్‌ఎస్)పై ఐదుగురు బీఆర్‌ఎస్, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ ఈ నెల 20న కలెక్టర్‌కు సంతకాలతో కూడిన తీర్మానం నోటీసు అందజేశారు. నాటి నుంచి ఇరు పార్టీలకు చెందిన 9 మంది కౌన్సిలర్లు క్యాంపులోనే ఉన్నారు. వచ్చే నెల 9న అవిశ్వాసంపైఓటింగ్ పెట్టడానికి కౌన్సిలర్లకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. కాగా బీఆర్‌ఎస్ సింబల్‌పై గెలిచిన ఏడుగురు కౌన్సిలర్ల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు ఉన్నారు. వారికి విప్ జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

పంచాయతీల్లో ప్రత్యేక పాలనే..

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ఆ మరుసటి రోజు నుంచి అమలు
- కసరత్తు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- నాలుగు శాఖల నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల జాబితా సిద్ధం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1వతేదీతో ముగియనుంది. ఆ మరుసటి రోజు నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే గ్రామాల్లో ఏయే శాఖల అధికారులను నియమించాలనే విషయంపై జిల్లాయంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ఈమేరకు జాబితాను కూడా సిద్ధం చేసింది.

ఆయా శాఖల ఉద్యోగులకు బాధ్యతలు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి 2018 డిసెంబర్‌లో మూడు విడతల్లో ఎన్నికలు జరిగిన విషయం విదితమే. అయితే ఓ గ్రామ పంచాయతీ సర్పంచ్ చనిపోగా, మరో ముగ్గురు పంచాయతీ సర్పంచ్‌లు వివిధ కారణాలతో రాజీనామా చేశారు. దీంతో ఈ నాలుగు చోట్ల ఉప సర్పంచ్‌లు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ప్రత్యేక అధికారులుగా జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను నియమిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల్లో పనిచేస్తున్న వీరికి అవసరాలను బట్టి ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు గ్రామ పంచాయతీలను కేటాయించనున్నారు. వీరిపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

పెండింగ్‌లో బిల్లులు

గత ప్రభుత్వంలో చాలా మంది సర్పంచ్‌లు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశారు. వీరిలో చాలా మందికి బిల్లులు రాలేదు. కొత్త ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయడంతో బిల్లుల విడుదలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక అధికారుల నియామకం వైపు మొగ్గు చూపింది. అయితే వీరిని నియమిస్తే బిల్లుల పరిస్థితి ఏమిటని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. నిధులు లేకున్నా అప్పులు చేసి మరీ వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా పనులు చేయడంతో ఇప్పుడు వారు తల పట్టుకుంటున్నారు.

ఎంబీ రికార్డులుంటేనే..

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు తమ పదవీ కాలంలో చేపట్టిన బిల్లుల చెల్లింపులకు కచ్చితంగా ఎంబీ రికార్డులు ఉండాల్సిందేనని పంచాయతీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ, ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. వీటి ద్వారా గ్రామ పంచాయతీల్లో వివిధ పనులు చేపట్టారు. ఆయా పనుల్లో చాలావాటికి బిల్లులు చెల్లించలేదు. పదవీ కాలం ముగుస్తున్నా చేసిన బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వద్ద ప్రస్తావించగా పంచాయతీల్లో పూర్తిచేసిన పనులకు సంబంధించి ఈనెలాఖరులోగా ఎంబీరికార్డులు, గ్రామ పంచాయతీ తీర్మానాలు, స్టాక్ రిజిస్టర్ ఉంటే బిల్లులు చెల్లింపులో ఇబ్బందులు ఉండవన్నారు.

అర్జీలపై సత్వరమే స్పందించాలి



ప్రజావాణిలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, చిత్రంలో అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డిలతో కలిసి అర్జీలను స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ప్రజావాణిలో మొత్తం 67 అర్జీలు అందినట్లు వెల్లడించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో ప్రహరీలు, టాయిలెట్లు, డ్రెయినేజీలు, కొత్త గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ కోటచలం పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12, 19 తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఫిబ్రవరి 12, 19 తేదీల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సూచించారు. నులిపురుగుల నివారణపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్ర పౌడర్ చేసి అందించాలని, రెండు నుంచి మూడేళ్ల పిల్ల లకు ఒక మాత్రపౌడర్ చే ఇవ్వాలని, 3 నుంచి 19 ఏళ్లలోపు వారికి మాత్ర ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కోటా చలం, డీఐఓ వెంకటరమణ, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఐఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

పక్కా ప్రణాళిక రూపొందించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారిని నియామక పత్రాల కోసం హైదరాబాద్ పంపడానికి పక్కా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా వైద్యాధికారులు, కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంకతో కలిసి పాల్గొని మాట్లాడారు. స్టాఫ్ నర్సులకు ఈనెల 31న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 212 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపికయ్యారని వీరిని బస్సుల ద్వారా హైదరాబాద్‌కు నిర్దేశించిన సమయానికి పంపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సురేష్, డీఎంహెచ్ఓ కోటాచలం, సివిల్‌సప్లయ్ రాంపతి, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకుడు మురళీధర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శారద, డీపీఓ యాదయ్య తదితరలు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ రూ. 3 కోట్లు

- ఆమోదించిన అదనపు కలెక్టర్



బడ్జెట్ పత్రాలను అదనపు కలెక్టర్‌కు అందిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ. 3 కోట్లతో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియంక ఆమోదించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ అంచనాలపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పబ్లిక్ రీడింగ్ రూమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు పుస్తకాలు, ఫర్నిచర్ సమకూర్చాలని సూచించారు. సమావేశంలో డీపీఓ యాదయ్య , డీఈఓ అశోక్ , కే.వీ. సీతారామశాస్త్రి, ఎం.బీ రంగారావు, ఎమ్మెస్ శ్రవణ్ కుమార్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ గడువు పొడిగింపు

- ఆహార భద్రత కార్డు ఈకేవైసీకి ఫిబ్రవరి నెలాఖరు వరకు అవకాశం
- ఇప్పటి వరకు 72శాతం ఈకేవైసీ పూర్తి
- నూరు శాతం నమోదుకు అధికారుల ప్రణాళిక



హుజూర్‌నగర్: ఆహార భద్రత కార్డుల ఈ- కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు ఉన్న గడువును ప్రభుత్వం ఫిబ్రవరి 28 వరకు పొడిగించింది. ఈ-కేవైసీ ప్రక్రియ మందగించడంతో పాటు అనుకున్న లక్ష్యానికి చేరుకోక పోవడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెలరోజుల్లో లబ్ధిదారులు ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే కార్డు నుంచి వారి పేర్లను తొలగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నూరు శాతం ఈ కేవైసీ చేయించేందుకు సంబంధిత డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే చిన్నారుల విషయంలో ఆధార్ నవీకరణ కాకపోవడుతో ఈకేవైసీ ప్రక్రియ వేగంగా జరగడం లేదు.

జిల్లాలో లబ్ధిదారులు 9,31,827 మంది..

జిల్లాలో ఆహార భద్రత కార్డులు 3,24,194 ఉండగా వాటిలో 9,31,827 మంది లబ్ధిదారులు నమోదై ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 6,71,886 మంది ఈ కేవైసీ చేయించు కోగా ఇంకా 2,59,941 మంది చేయించుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు 72.10 శాతం మంది ఈ కేవైసీ చేయించుకున్నారు.

నవీకరణ పూర్తి చేయించక ఇబ్బందులు..

ఈ-కేవైసీ ప్రక్రియకు ఆధార్ అడ్డంకిగా మారింది. కొందరు లబ్ధిదారులు ఆధార్ కేంద్రాలకు వెళ్లి నవీకరణ ప్రక్రియ పూర్తి చేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడం లేదు. ఇదేంటని ఇతర ఆధార్ కేంద్రాలకు వెళ్లి వాకబు చేస్తే నవీవకరణ పూర్తికాకపోవడంతో ఈ-కేవైసీ తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో లబ్ధిదారులు వేర్వేరు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగాల్సి వస్తోంది. ఇక చిన్నారుల విషయంలో ఇదే రకమైన ఇబ్బందులు ఎదురవుతుఉన్నాయి. ఆధార్ కార్డులు ప్రవేశ పెట్టినప్పుడు చిన్నారులకు కూడా గ్రామాల్లోనే కార్డులు ఇచ్చారు. పిల్లలకు 5 ఏళ్లు పైబడిన తర్వాత వేలిముద్రల నవీకరణ పూర్తిచేయించక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తే లబ్ధిదారులకు మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

72 శాతానికి పైగా ఈ కేవైసీ చేయించుకున్నారు



జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈ కేవైసీ చేస్తాం. ఇప్పటికే దాదాపు 72 శాతానికి పైగా ఈ కేవైసీ చేయించుకున్నారు. లబ్ధిదారులందరిచీ ఈ కేవైసీ చేయించాలని ఇప్పటికే డీలర్లకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజల సహకారంతో సాధ్యమైనంత తొందరలో అందరిచీ ఈ కేవైసీ పూర్తి చేస్తాం.

– వి.మోహన్‌బాబు, డీఎస్ఓ, సూర్యాపేట

ఆధార్ కేంద్రాల సేవలు లేక..

ఆధార్ కేంద్రాలు చాలా చోట్ల మండలానికి ఒకటి కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఆధార్ అందుబాటులో ఉన్నా సకాలంలో సేవలు అందడం లేదు. కొన్ని చోట్ల స్థానికంగా కేంద్రం లేక ఇతర మండలాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కనీసం మండలానికి ఓ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తే మంచిదని పలువురు కోరుతున్నారు.

గంజాయి రవాణాపై పటిష్ట నిఘా పెట్టాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

కోదాడ రూరల్: గంజాయి రవాణా, వినియోగంపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) కేసులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి కేసుల దర్యాప్తులో పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్లాలని, అన్ని విషయాలతో పాటు నిందితుల గుర్తింపును కూడా రికార్డుచేయాలని సూచించారు. గంజాయి వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి వారిని సన్మార్గంలో వెళ్లేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు రాము, వీర రాఘవులు, రామకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్రజావాణిలో 7 ఫిర్యాదులు

సూర్యాపేట క్రైం: పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదుల పరిష్కారానికి అధికారలు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి క్రైం : రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి, వంగపల్లి మధ్య గల 248/10-12 దిగువ లైన్ రైలుపట్టాల పక్కన సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జె.కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుగు రంగు గీతల చొక్కా, బుడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతోనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలకు 9848222169, 87125 68454 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుపైన గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. గట్టుపైన ఎల్లమ్మ ఆలయం సమీపంలో వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఈర్ల శ్రీనివాస్‌రెడ్డి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వద్ద ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్ర అంతిరెడ్డి తెలిపారు.

నాసిరకం విత్తనాలు విక్రయించారని ఫిర్యాదు

నకిరేకల్ : నాసిరకం విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన యాతాకుల సోమయ్య, యాదమ్మ సోమవారం వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. వరిపంట సాగుకు నకిరేకల్‌లోని సాయికృష్ణ ఎరువుల దుకాణంలో మహీంద్ర కంపెనీకి చెందిన 606 రకానికి చెందిన రెండు సంచుల వరి విత్తనాలను ఒక్కోటి రూ.1100 చెల్లించి కొనుగోలు చేశామని తెలిపారు. నాటు వేసి 80రోజులు అవుతున్నా గింజల కంకులు లేవని వాపోయారు. నాసిరకం విత్తనాలు విక్రయించిన సదరు దుకాణదారుడితో పాటు సదరు కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న గమన్‌రెడ్డి

నేరేడుచర్ల: ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్‌రెడ్డి అర్హత సాధించాడు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 28న జరిగిన రెండవ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్-2024లో కొణతం గమన్‌రెడ్డి అండర్-20 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్‌ను సాధించి ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గమన్‌రెడ్డి అల్కాపూర్ టౌన్ షిప్‌లోని స్కాలర్ ఆకాడమీలో 3వ తరగతి చదువుతున్నాడు. టౌన్ షిప్‌లో ఉన్న కోచ్ సుబ్బారావు సీట్స్ సంస్థలో శిక్షణ పొందుతున్నాడు.

నిర్లక్ష్యానికి ఆరుగురు బలి

- ముందు వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పిన కారు
- ఆపై డివైడర్‌ను ఢీకొట్టి ఏపీవైపు వెళ్లే మార్గంలో బోల్తా
- అదే సమయంలో వేగంగా వచ్చి కారును ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన పొట్టులోడు లారీ
- అక్కడికక్కడే ఐదుగురు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి


మిర్యాలగూడ ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు


కూతురు రిషితతో మహేష్, జ్యోతి దంపతులు (ఫైల్)


కుమారుడు లియాన్స్‌తో మశ్చేంద్ర, మాధవి దంపతులు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఒకరి నిర్లక్ష్యం రెండు కుటుంబాలను బలి తీసుకుంది. ముందుగా వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాని వెనకే వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలిరోడ్డుపై బోల్తాకొట్టింది. ఇదే సమయంలో ఆ మార్గంలో వేగంగా వెళ్తున్న పొట్టు లారీ బోల్తాపడిన కారును ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. ఇదీ.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి గల కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. డీఎస్పీ వెంకటగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామానికి చెందిన చెరుపల్లి మహేష్, యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తన తోడల్లుడు బొమ్మ మశ్చేందర్ కుటుంబ సభ్యులు, మిర్యాలగూడ వెంకట్, కుమార్ అనే సమీప బంధువుల కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం నిమిత్తం రెండు కార్లలో 26న ఉదయం 5:30 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బయలుదేరారు. 26న ఏపీలోని పెనుగంచిప్రోలు, విజయవాడ దుర్గమ్మ ఆలయాలను దర్శించుకుని 27న మచిలీపట్నం బీచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 28న మోపిదేవిలో శని పూజలు నిర్వహించి కోటప్పకొండ ఆలయాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

ఢీకొట్టి.. 45 అడుగుల దూరం ఈడ్చుకెళ్లి..

మార్గమధ్యలో దామరచర్ల మండలం కొండ్రపోలు వద్ద ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఓ దాబాలో టిఫిన్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. స్నేహితులు ప్రయాణిస్తున్న కారు వారి ఇంటికి ఐదు నిమిషాలు ముందుగా చేరుకోగా మహేష్, మశ్చేందర్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారు పట్టణంలోని కృష్ణమానస కాలనీ వద్ద బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ముందుగా వెళుతున్న ఓ లారీడ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాని వెనకే ఉన్న కారు ప్రమాదాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఏపీ వైపు వెళ్లే మార్గంలో బోల్తాపడింది. అదే సమయంలో గుంటూరు వైపునకు వెళ్తున్న పొట్టు లారి బోల్తా కొట్టిన కారును సుమారు 45 అడుగుల మేర ఈడ్చు కెళ్లడంతో నుజ్జునుజ్జయింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న చెరుపల్లి మహేష్(32),


మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ఆయన భార్య జ్యోతి(30) కుమార్తె రిషిత(6), యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తోడల్లుడు బొమ్మ మశ్చేంద్ర (29) కుమారుడు లియాన్స్(2) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. కొన ఊపిరితో కారు వెనుక సీట్లో కూర్చున్న మశ్చేందర్ భార్య మాధవి(24)ని స్థానికుల సహాయంతో పోలీసులు బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. నందిపాడుకు చెందిన చెరుపల్లి మహేష్ హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటూ అవుట్‌డోర్ ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తుండగా మశ్చేందర్ చౌటుప్పల్ మండలంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు.

మృతుల నేత్రాలు దానం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెరుపల్లి మహేష్ ఆయన భార్య జ్యోతిల నేత్రాలను వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు అందించినట్లు తెలిపారు. తాము చనిపోయినా నలుగురికి కంటి చూపు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పొట్టు లారీని పట్టుకున్న పోలీసులు

కారును ఢీకొట్టిన తర్వాత ఆపకుండా వెళ్లిపోయిన పొట్టు లారీని సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్దంకి వద్ద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించినట్లు టుటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

గొల్నేపల్లిలో విషాదఛాయలు

వలిగొండ : వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన బొమ్మ మశ్చేందర్ (32) అతడి భార్య మాధవి(26) కుమారుడు నియాన్స్ (2) మిర్యాలగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి చేరుకున్న మృతదేహాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించారు.


గొల్నేపల్లిలో మృతదేహాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి పరామర్శ

కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు చనిపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో గల మార్చురీలో ఉన్న మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాలు మృతిచెందడంతో విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఏరియా ఆస్పత్రి వద్దకు భారీగా చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం చెరుపల్లి మహేష్, జ్యోతి(30) రిషిత(6) మృతదేహాలను స్వగ్రామం నందిపాడుకు తరలించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

మేనత్త అన్నీ తానై..

నందిపాడుకు చెందిన దేవులపల్లి పద్మ తన అన్న కూతుళ్లు అయిన జ్యోతి, మాధవిలను చిన్న తనంలోనే దత్తత తీసుకుంది. అప్పటినుంచి వారికి అన్నీ తానై భర్త ఆమె భర్త నాగభూషణంతో కలిసి పెంచి పెద్ద చేసింది. ఓ రైస్ మిల్లులో వాచ్‌మన్‌గా పని చేస్తున్న నాగభూషణం పెంచుకుంటున్న జ్యోతిని బీఎస్సీ బీఈడీ, మాధవిని బీటెక్ వరకు చదివించారు. ఎనిమిదేళ్ల క్రితం నందిపాడుకు చెందిన మహేష్‌తో జ్యోతికి, మూడేళ్ల క్రితం మాధవికి మశ్చేందర్‌తో వివాహాలు జరిపించారు. మేన కోడళ్లను కన్నబిడ్డలుగా పెంచుకున్న జ్యోతి, మాధవిలు ఇక లేరన్న చేదునిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పెంచుకున్న పిల్లలిద్దరితో పాటు వారి భర్తల మృతదేహాల వద్ద ఆ పెంపుడు తల్లి(మేనత్త) రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.


రోదిస్తున్న మాధవి, జ్యోతిల పెంపుడు తల్లిదండ్రులు దేవులపల్లి పద్మ, నాగభూషణం

డివైడర్‌పైకి ఆర్టీసీ బస్సు

ఆలేరు రూరల్: ఆలేరు శివారులోని హైదరాబాద్ - వరంగల్ రహదారిపై కందిగడ్డతండా శివారులో సోమవారం జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న బస్సు కందిగడ్డతండ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో మొత్తం 40 మంది ప్రయాణికులు ఉన్నారు.


ఆలేరులో రోడ్డు డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు ఎగ్జిబిట్లు


బీబీనగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎగ్జిబిట్‌తో విద్యార్థులు, గైడ్ టీచర్


తుర్కపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎగ్జిబిట్‌తో విద్యార్థిని వైష్ణవి

భువనగిరి : ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భువనగిరి జిల్లాకు చెందిన రెండు ఎగ్జిబిట్లు దక్షిణ భారత వైజ్ఞానిక (సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్) ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఈ నెల 30, 31వ తేదీల్లో జరగనున్న పోటీల్లో ఈ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నట్లు డీఈవో కె నారాయణరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భరణికుమార్ సోమవారం తెలిపారు. దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌కు రాష్ట్రం నుంచి ఎంపికైన 25 ఎగ్జిబిట్లలో భువనగిరి జిల్లాలోని బీబీనగర్, తుర్కపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన రెండు ఎగ్జిబిట్లు ఉన్నాయి.

హమాలీలు లోడ్ సులభంగా మోసే పరికరం

హమాలీలు వస్తువులను సులభంగా లోడ్ చేసే పరికరాన్ని రూ.1300 నుంచి రూ.1500 ఖర్చుతో తయారు చేయవచ్చు. ప్రస్తుతం హమాలీలు బరువైన వస్తువులను తల, భుజంపై మోస్తూ శారీరక బాధలు అనుభవిస్తున్నారు. వీటికి చెక్ పెట్టే విధంగా పరికరం రూపొందించాం. ఎంత బరవు మోసినా ఆ బరువు శరీరంలోని అన్ని భాగాల పై విభజించడం ద్వారా సలభంగా వస్తువులను అనుకున్న ప్రదేశానికి లోడర్ పరికరం ద్వారా చేర్చవచ్చు.

– కె.సాయితేజచారి, జి.కిరణ్, 9వ తరగతి, బీబీనగర్, జడ్పీహెచ్‌ఎస్

పువ్వులను రీసైక్లింగ్

దేవాలయాలు, శుభకార్యాలలో వాడి పడేసిన పువ్వులను రీసైక్లింగ్ చేయవచ్చు. వాడిపడేసిన పువ్వులను సేకరించి వాటిని ఎండబెట్టాలి. అనంతరం వాటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా అగర్‌ఒత్తులు, దోమల నియంత్రణ కాయిల్స్, డెకరేటివ్ వస్తువులను తయారు చేయవచ్చు.

– టి.వైష్ణవి, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ తుర్కపల్లి

గీత కార్మికుడికి గాయాలు

గరిడేపల్లి: తాడి చెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గరిడేపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతు చిన్న భిక్షం రోజువారీగా సోమవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు రెండు కాళ్లు విరిగి పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మహా శివుడికి విశేష అభిషేకాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహాశివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను విశేషంగా చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, పూజారులు శ్రీస్వామి వారి ఆశీస్సులను అందజేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలు ఆచార్యులు జరిపించారు.


మహా శివుడికి పూజలు చేస్తున్న పూజారులు

తెలంగాణ కబడ్డీ జట్ల కెప్టెన్లుగా నల్లగొండ వాసులు

హాలియా : మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరిగే 49వ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలబాలికల జట్లకు నల్లగొండ జిల్లా వాసులు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. బాలికల జట్టుకు హాలియా మున్సిపాలిటీ పరిధి ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన ఎస్‌కే.అయేషా, మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మణ్ బాలుర జట్టు కెప్టెన్లుగా ఎంపికయ్యారని నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్తయ్య తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన ఎస్‌కే.అయేషా అండర్ 14, అండర్ 17, అండర్ 19 సబ్ జూనియర్, సీనియర్ కబడ్డీ జాతీయ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆలగడప గ్రామానికి లక్ష్మణ్ కబడ్డీ క్రీడపై ఆసక్తితో నాలుగు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లోని సాయి స్పోర్ట్స్ హాస్టల్ శిక్షణ పొందుతూ సబ్ జూనియర్, సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన ఎస్ కీర్తి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జూనియర్ విభాగంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తెలంగాణ కబడ్డీ జట్లకు కెప్టెన్లుగా ఎంపికైన అయేషా, లక్ష్మణ్‌ను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కారదర్శులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జగదీశ్వర్ అభినందించారని ఆయన తెలిపారు.


అయేషా, బాలికల జట్టు కెప్టెన్


లక్ష్మణ్, బాలురు జట్టు కెప్టెన్

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ఒకరు మృతి

గుండాల : ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు.ఈ ఘటన గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓర్సు మైసయ్య కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులో కాలకృత్యాలు తీర్చుకుని వస్తుండగా కాలుకు గడ్డి తగిలి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయాడు. దీంతో మైసయ్య విద్యుదాఘాతానాకి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే తన భర్త మృతిచెందినట్లు మైసయ్య భార్య మైసమ్మ ఆరోపించింది. మృతదేహాన్ని ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య సందర్శించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి సంతాపం తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య

నాంపల్లి : వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. నాంపల్లి, వలిగొండ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం రాజ్యతండాకు చెందిన రమావత్ నాగు(36) తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. సమీప గ్రామానికి చెందిన ఓ మహిళతో నాగు కొంతకాలంగా సఖ్యతగా మెలుగుతున్నాడు. ఇద్దరు కలసి రోజు వారీలా నాంపల్లి మండలంలోని పగిడిపల్లి గ్రామానికి అదివారం ఓ ఇల్లు నిర్మాణం చేయడానికి వెళ్లారు.అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నాగు మనస్తాపం చెంది. అక్కడినుంచి వెళ్లిపోయాడు. అనంతరం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనుమానంతో ప్రియురాలు వెతుక్కుంటూ రాగా నాగు చెట్టుకు వెలాడుతూ విగతజీవుడిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న మృతిడి కుటుంబ సభ్యులు, బంధువులు నాగు ప్రియురాలి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులు రంగప్రవేశం ఆందోళనను విరమింపజేశారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.


నాగు మృతదేహం

గొల్నేపల్లిలో..

వలిగొండ : వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన రాధారపు రమేష్(30) ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి రమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. రమేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరి దుర్మరణం

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండలం బొజ్జగూడెం గ్రామానికి చెందిన ధరావత్ బాలాజీ(53) పొలం వద్ద పనులు ముగించుకుని కోదాడ వైపు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో తమర్మరబండ పాలెం వద్ద కోదాడ వైపు వస్తున్న ఆటో ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో బాలాజి అక్కడికక్కడే మృతిచెందగా ఆటో డ్రైవర్ దాసాజు నాగేంద్రబాబుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ నాగేంద్రబాబును ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుని భార్య ధరావత్ నీలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మృతుడు బాలాజీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


బాలాజీ (ఫైల్)

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రామగిరి(నల్లగొండ): చోరీ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన సుశీల ఈ నెల 21న వ్యవసాయ బావికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం రాయినిగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సీసీ టీవీలో చూసిన బైక్‌పై నిడమనూరు మండలం ముకుందాపురానికి చెందిన నల్లంగుల శివకుమార్, నల్లగొండ మండలం చందనపల్లికి చెందిన సంపంగి యువరాజులు ఉండటంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నల్లగొండ పట్టణానికి చెందిన సంపంగి వెంకటేష్‌తో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

మిర్యాలగూడలో ఫేషియల్ క్రీమ్‌లు సీజ్

- మెడికల్ ఏజెన్సీపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు
- సీజ్ చేసిన క్రీమ్‌లు కోర్టుకు..
- కంపెనీపై కేసు నమోదు చేస్తామంటున్న డీఐ సోమేష్

మిర్యాలగూడ అర్బన్: ముఖాలు తెల్లగా మెరిసేలా తయారవుతాయని, ముఖంపై ముడతలు సైతం మాయమవుతాయని ప్రకటనలు ఇస్తూ ఫేస్ క్రీమ్‌లను ప్రజలకు అంటగడుతున్న ఓ కంపనీకి చెందిన ఫేషియల్ క్రీమ్‌లను గుర్తించిన డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆ క్రీమ్‌లను సీజ్ చేశారు. ఓ ఫార్మా కంపెనీకి చెందిన ఫెయిర్ అండ్ బ్రైట్ అనే క్రీమ్‌లను వాడుతున్న కొంత మంది మహిళలు వాటి ద్వారా దుష్ప్రభావాలు కలిగాయని ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేశారు. దీనిలో భాగంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం రోడ్డులో గల గోపికృష్ణ మెడికల్ ఏజెన్సీలో తనిఖీలు చేపట్టిన జిల్లా ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేష్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.10,080 విలువ చేసే 60 ఫెయిర్ అండ్ బ్రైట్ క్రీమ్‌లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. స్వాధీనం చేసిన స్టాక్‌ను గోపికృష్ణ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు హైదరాబాద్‌లోని మానస డిస్ట్రిబ్యూటరీ నుంచి తెప్పించినట్లు బిల్లులు గుర్తించామని, బిల్లుల ఆధారంగా మానస డిస్ట్రిబ్యూటరీ నిర్వాహకులకు నోటీసులు ఇస్తామని అధికారులు తెలిపారు. క్రీమ్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కోర్టులో సరెండర్ చేశామని తెలిపారు. సదరు కంపనీపై కేసును సైతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఐ సోమేష్ పేర్కొన్నారు.

గ్రానైట్ లీజు రద్దు చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తిరుమలగిరి మండలం తొండ గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 98 ప్రభుత్వ భూమిలో 4.57 హెక్టార్స్ భూమిని పటేల్ గ్రానైట్స్ కంపెనీకి ఇచ్చిన లీజ్ అగ్రిమెంట్ రద్దు చేయాలని సర్పంచ్ నెమరుగొమ్మల వెంకటశాత వాహనరావు కోరారు. సోమవారం గ్రామస్తులతో కలిసి కలెక్టర్ వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీకి, ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా 2018లో అప్పటి తిరుమలగిరి మండలం తహసీల్దార్ విజయ్‌కుమార్, గిర్దవార్, సర్వేయర్ కలిసి పంచనామా చేయకుండా పటేల్ గ్రానైట్స్ కంపెనికి ఎన్‌వోసీ మంజూరు చేశారని తెలిపారు. ఆ సర్వే నంబరులో గుడి, రైతు వేదిక, డంపింగ్ యార్డ్, క్రీడా ప్రాంగణం, పకృతి వనం పశువుల సంత, ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వాటికి విఘాతం కలుగే అవకాశం ఉన్నందున కంపెనీకి ఇచ్చిన లీజు రద్దు చేయలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.